సాక్షి మెదక్

7

ఆదివారం । 10 । ఆగస్టు । 2025

బాక్స్ క్రికెట్.. భలే క్రేజ్

బాక్స్ క్రికెట్ కాలక్రమేణా నగరాల నుంచి పట్టణాలు, గ్రామాలకు విస్తరిస్తోంది. ఆడుకోవడానికి స్థలాలు లేకపోవడంతో యువత, చిన్నారులు, మధ్య వయస్కులు ఇటు వైపు మొగ్గు చూపుతున్నారు. తమకు సమయం దొరికినప్పుడు ఈ బాక్స్ ప్రాంగణంలో చార్జీలు చెల్లించి మరీ క్రికెట్ ఆడుతున్నారు. ఈ నేపథ్యంలో బాక్స్ క్రికెట్ క్రేజ్‌పై ఈ వారం సాక్షి సండే కథనం.

సండే స్పెషల్



- చంద్రపు అమరేందర్ రెడ్డి, రామాయంపేట(మెదక్)

8లో

న్యూస్‌రీల్

12న పరిశ్రమల కమిటీ సమావేశం

మెదక్ కలెక్టరేట్: ఈనెల 12న జిల్లాలోని హానికర పరిశ్రమల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల ఉప ప్రధాన అధికారి లక్ష్మీకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని హానికర పరిశ్రమల కమిటీ సభ్యులు విధిగా హాజరు కావాలన్నారు. సమావేశానికి కమిటీ సభ్యులు, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల పరిశ్రమల అధికారులు, జిల్లా పర్యావరణ అధికారి, లేబర్ కమిషనర్, ఫైర్ తదితర శాఖల అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

మంత్రులపై వ్యాఖ్యలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: దళిత మంత్రులు దామోదర, వివేక్ వెంకటస్వామిపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి దామోదర కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఇప్పటికైనా కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

కౌడిపల్లి(నర్సాపూర్): యూరియా కోసం రైతులు బారులు తీరారు. శనివారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రానికి 450 బస్తాల యూరియా రాగా, వివిధ గ్రామాలకు చెందిన రైతులు భారీగా తరలివచ్చారు. నిర్వాహకులు రైతు ఆధార్‌కార్డు, ఈ-పాస్ మిషన్ల ద్వారా యూరియా విక్రయించారు. రైతులు ఆందోళన చెందవద్దని సరిపడా యూరియా అందుబాటులో ఏఓ స్వప్న తెలిపారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం

డీఎంహెచ్‌ఓ శ్రీరామ్



మెదక్ కలెక్టరేట్: పిల్లల్లో నులి పురుగుల నివారణే లక్ష్యంగా జిల్లాలోని పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేసేలా చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌ఓ శ్రీరామ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 11న జాతీయ నులి పురుగుల దినోత్స వం సందర్భంగా మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 19 ఏళ్లలోపు పిల్లలు 2,11,964 మంది ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచే అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు వేసేలా తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలోని అన్ని సబ్ సెంటర్, పీహెచ్‌సీలలో మాత్రలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ఆర్టీసీ 'స్పెషల్' దోపిడీ

దుబ్బాకటౌన్: పండుగ పూట ఆర్టీసీ సంస్థ ప్రయాణికులపై చార్జీల పిడుగు పడింది. పండుగ స్పెషలంటూ బస్సులు నడుపుతూ అదనపు చార్జి వసూల్ చేయడం ప్రారంభించింది. దీంతో పండుగ పూట ప్రయాణికులపై పెను భారం పడింది. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తూనే అదనపు చార్జీల పేరుతో మగవారి జేబుకు చిల్లుపెట్టింది. దుబ్బాక నుంచి సిద్దిపేటకు మామూలు రోజుల్లో ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.40 టికెట్ ఉండగా రాఖీ పౌర్ణమి సందర్భంగా ఏకంగా రూ.70 వసూలు చేయడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. రూ.70 పెట్టిన కనీసం బస్సుల్లో సీటు దొరకపోవడం గమనార్హం. ఎక్స్‌ప్రెస్ పేరు పెట్టి గ్రామ గ్రామాన బస్సు ఆపడంతో ప్రయాణికులు విసుగు చెందారు.



దుబ్బాక - సిద్దిపేటకు రూ.70 టికెట్



సంగాయిపేట పెద్ద చెరువు కింద వరి సాగు

పరుచుకున్న పచ్చదనం

కొల్చారం మండలం వరి సాగుకు పెట్టింది పేరు. 70 శాతం రైతులు బోర్లపై ఆధారపడి పంట సాగు చేస్తారు. వానాకాలం సీజన్‌లో గ్రామాల్లో ఎక్కడ చూసిన వరి పంటతో పొలాలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో వరి సాగు చేసిన రైతులు పంట పొలాలను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- కొల్చారం(నర్సాపూర్)

రాఖీ రష్..



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



రాఖీ పండుగ సందర్భంగా శనివారం నర్సాపూర్ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి భారీ వర్షం కురవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. ఉదయం 10 గంటల తర్వాత అందరూ ప్రయాణాలు ప్రారంభించడంతో బస్టాండ్ కిక్కిరిసింది. కాగా పలు మార్గాల్లో బస్సులు కొంత ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు ఎక్కువ సేపు నిరీక్షించాల్సి వచ్చింది. నర్సాపూర్ నుంచి అన్ని మార్గాలలో సర్వీసులు నడుస్తున్నాయని, ప్రయాణికులు ఒకేసారి రావడంతో కొన్ని మార్గాలలో రద్దీ ఏర్పడిందని కంట్రోలర్ వెంకట్‌గౌడ్ తెలిపారు.

- నర్సాపూర్

వర్షాతిరేకం..!

- అత్యధికంగా శివ్వంపేట మండలంలో 41.1 మి.మీ నమోదు
- ఆరుతడి పంటలకు జీవం

జిల్లా అంతటా భారీ వర్షం



శివ్వంపేట: మత్తడి దూకుతున్న శభాశ్‌పల్లిలోని పిల్లిగుండ్ల చెక్‌డ్యాం

మెదక్‌జోన్/నర్సాపూర్/శివ్వంపేట/మనోహరాబాద్(తూప్రాన్): జిల్లాలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు లోటు వర్షపాతం నమోదు కాగా, పంటలసాగు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ఇప్పటికే సాగుచేసిన పంటలకు నీటి తడులు అందలేదు. ఈ వర్షంతో వర్షాధార పంటలకు జీవం పోసినట్లు అయింది. జిల్లావ్యాప్తంగా ఈఏడాది 3.50 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగుకావాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 2.50 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఈ లెక్కన ఇంకా లక్ష ఎకరాల్లో వరి సాగు కావాల్సి ఉంది. ఆరుతడి పంటలతో పాటు పత్తి, కూరగాయల సాగు అంచనా మేరకు సాగైంది. ఇదిలాఉండగా గత వారం రోజులుగా వేసవిని తలపించే విధంగా ఎండలు దంచికొట్టాయి. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పంటలు సైతం వాడుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు 9.4 మిల్లీమీటర్ల వర్షం కురవటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో ఇప్పటివరకు 377 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, 353 మిల్లీ మీటర్ల వర్షం మాత్రమే నమోదు అయినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా 24 మిల్లీ మీటర్ల వర్షం తక్కువగా కురిసింది.

నర్సాపూర్‌లో అతలాకుతలం

నర్సాపూర్ మున్సిపాలిటీలోని పలు కాలనీలు వర్షానికి అతలాకుతలం అయ్యాయి. మురికి కాల్వల వ్యవస్థ సరిగా లేకపోవడంతో గోకుల్ నగర్, విఘ్నేశ్వర కాలనీలో పలువురి ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందుల పాలయ్యారు. పట్టణంలోని పోస్టాఫీస్ ఏరియాలో రోడ్లపై నుంచి వరద పారింది. పంది వాగు నుంచి రాయరావు చెరువులోకి భారీగా వర్షం నీరు వచ్చి చేరుతోంది. దీంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా మండలంలో 33 మిల్లీ మీటర్ల వర్షం నమోదైందని సంబంధిత అధికారులు తెలిపారు. అలాగే శివ్వంపేట మండలవ్యాప్తంగా కురిసిన భారీ వర్షంతో చెక్‌డ్యాంలు మత్తడి దూకాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. జిల్లాలోనే అత్యధికంగా మండలంలో 41.1 మిల్లీ మీటర్ల వర్షాపాతం నమోదైంది. అలాగే మనోహరాబాద్, పోతారం, పర్కిబండ, తుపాకులపల్లి, పాలట గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుండపోత వర్షం కురిసింది. పోతారం- తు పాకులపల్లి మధ్య రోడ్డుపై వరద చేరడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందు లు కలిగాయి. పలు వీధులు చెరువులను తలపించాయి.



నర్సాపూర్: విఘ్నేశ్వర కాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షం నీరు



పోతారం- తుపాకులపల్లి రోడ్డుపై వరద నీరు

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్



కలెక్టర్‌కు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

టేక్మాల్(మెదక్): కేజీబీవీల్లో చదివే విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం మండలంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, స్టోర్ రూం, వంటగదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. చదువులో రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా విద్యార్థినులు కలెక్టర్‌కు రాఖీలు కట్టి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసి రిజిస్టర్ తనిఖీ చేశారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు.

నిరంతర విద్యుత్ సరఫరా చేయాలి

పాపన్నపేట(మెదక్): వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల పరిధిలోని మిన్పూర్ 220/132/33 కేవీ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు జరుగుతున్న విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. సాంకేతిక సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఖాళీ ప్రభుత్వ స్థలాలు గుర్తించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ నగేశ్‌తో కలిసి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరా సౌర గిరిజల వికాస పథకం అమలు వేగవంతం చేయాలని సూచించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి దామోదర రాజనర్సింహ



మంత్రి దామోదరకు రాఖీ కడుతున్న మహిళలు

రేగోడ్(మెదక్): అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండల కేంద్రంలో శనివారం మంత్రి పర్యటించారు. కార్యకర్తలతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ గృహాన్ని పరిశీలించి, మండలానికి మంజూరైన ఇళ్లు, నిర్మాణ పనులు ఎలా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో విద్యుత్ తీగలు వేలాడుతుండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇళ్లు మంజూరవుతాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తూనే.. మండలాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం మహిళలు మంత్రి దామోదరకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కిషన్, మాజీ జెడ్పీటీసీలు యాదగిరి, రాజేందర్ పాటిల్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు శంకరప్ప, మాజీ సర్పంచ్ విజయభాస్కర్, మాజీ ఎంపీటీసీ నరేందర్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఉప్పు - నిప్పు





ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలతో వేడెక్కిన రాజకీయం

- బీఆర్ఎస్–కాంగ్రెస్ మాటల యుద్ధం
- ఉద్రిక్తత నేపథ్యంలోనే మంత్రి వివేక్ పర్యటన రద్దు

దుబ్బాక: కాంగ్రెస్–బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధంతో దుబ్బాక రాజకీయం రాజుకుంటుంది. ఇరుపార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. రెండ్రోజులక్రితం మెదక్ సభలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కాంగ్రెస్ మంత్రుల పనితీరుపై తీవ్రస్థాయిలో దనుమాడారు. దీనికి కౌంటర్‌గా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అంతేస్థాయిలో ధ్వజమెత్తడంతో దుబ్బాక రాజకీయం ఉప్పు నిప్పుగా మారింది. దీనికి ఆజ్యం పోసేట్లు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఒకరిపై ఒకరు సామాజిక మాధ్యమాల్లో సైతం రాజకీయ విమర్శలు చేసుకుంటుండటంతో దుబ్బాకలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ఆదివారం మంత్రి వివేక్ పర్యటన సైతం రద్దయింది.

ఇంటెలిజెన్స్ సూచన మేరకే...

ప్రస్తుతం దుబ్బాక నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం మంత్రి వివేక్ పర్యటన రద్దు అయింది. వాస్తవానికి తొగుట, మిరుదొడ్డి, దుబ్బాక, భూంపల్లి, అక్బర్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో పర్యటించి లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేయాల్సి ఉంది. ఈ కార్యక్రమాల ఏర్పాట్లు సైతం అధికారులు సిద్ధం చేశారు. అయితే ఇంటెలిజెన్స్ అధికారుల సూచనల మేరకు శనివారం సాయంత్రం మంత్రి వివేక్ తన పర్యటనను రద్దు చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

దుర్వాసన భరించలేం

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అయ్యమ్మ చెరువు నిండుకుండలా మారింది. సమీపంలోని ఇళ్లకు వరద నీరు రావడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రసాయన వ్యర్థ జలాలతో కలుషితమయంగా మారిన చెరువు నీరు ఇళ్లకు సమీపంలోకి రావడంతో వాసన తట్టుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు నీటిలో ఉండే పాములు, ఇతర కీటకాలు ఇళ్లల్లోకి రావడంతో ఆందోళన చెందుతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ముక్కు మూసుకొని నిరసన తెలుపుతున్న ప్రజలు

బేషరతుగా క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంత్రులు, కలెక్టర్‌పై చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. బాధ్యతగల ఎమ్మెల్యే పదవిలో ఉంటూ అసభ్యకర వ్యాఖ్యలు చేయడం విచారకరమన్నారు. బీఆర్ఎస్ రైతు ధర్నా పేరుతో తమ ఉనికి కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే గ్రామాల్లో తిరగలేరని హెచ్చరించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆటలో కొత్త ప్రభాకర్‌రెడ్డి కీలుబొమ్మగా మారారని విమర్శించారు. ఉన్నత స్థానంలో ఉన్న కలెక్టర్ రాహుల్‌రాజ్ పట్ల అసభ్యంగా మాట్లాడడం విచారకరమన్నారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేదిక

- పాఠశాలల్లో 'ఇన్‌స్పైర్ మనక్'
- సెప్టెంబర్ 15 వరకు అవకాశం

మెదక్ కలెక్టరేట్: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు 'ఇన్‌స్పైర్ మనక్' చక్కని వేదిక. ఈ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌లు ఉపాధ్యాయులకు సూచించాయి.

దరఖాస్తు ఇలా..

ముందుగా పాఠశాలను www.inspireawards&dst.in ద్వారా వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇదివరకే వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకొని ఉంటే స్కూల్ అథారిటీ ద్వారా లాగిన్ కావాల్సి ఉంటుంది. ప్రాజెక్ట్ తయారు చేసే విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఫొటో, ప్రాజెక్టుకు సంబంధించిన సమాచారం ఇన్‌స్పైర్ వెబ్‌సైట్ ద్వారా అప్‌లోడ్ చేసుకోవాలి. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను సెప్టెంబర్ 15వ తేదీలోపు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా అప్‌లోడ్ చేయాలి.

ఎంపికైతే రూ. 10 వేలు బహుమానం

ప్రభుత్వ, ప్రైవేట్, జెడ్పీహెచ్‌ఎస్, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, మైనార్టీ, గురుకులాల్లో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులుగా నిర్ధారించారు. ప్రతి తరగతి విద్యార్థి ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టుల అవసరాల మేరకు ప్రభుత్వం ఆర్థిక సాయం కింద రూ.10 వేలు అందిస్తుంది. విద్యార్థులు తాము రూపొందించే ప్రాజెక్ట్ వివరాలను ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ వెబ్‌సైట్‌కు పంపించాలి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు వివరాలను సరిచూసుకొని ఎంపికై న విద్యార్థి ఖాతాలో డబ్బులు జమ చేస్తారు. అయితే వివిధ రకాలైన ప్రయోగాల్లో రెగ్యులర్‌గా అనుకరణలు వస్తున్నాయని అధికారులు గుర్తించారు. గతంలో ఇన్‌స్పైర్ మనక్‌లో ప్రదర్శించిన ప్రాజెక్ట్‌లు తిరిగి ఈసారి అనుమతించరు. కేవలం కొత్త ఆలోచనలు, కొత్త పద్ధతులతో రూపొందించిన వాటికి మాత్రమే ప్రోత్సాహం ఉంటుంది.

ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు

inspire

జిల్లాలో ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలలు ఇన్‌స్పైర్ మనక్‌లో పాల్గొంటున్నాయి. అలా కాకుండా ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదు ప్రాజెక్ట్‌లు ఇన్‌స్పైర్ మనక్‌లో ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన ప్రకారం జిల్లాలోని అన్ని పాఠశాలలు పోటీకి సిద్ధమవుతున్నాయి. ఇందుకోసం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తప్పనిసరిగా ఐడియా కాంపిటీషన్ బాక్స్‌ను ఏర్పాటు చేసి ఉత్తమమైన ఐదు ప్రాజెక్టులను అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం సూచించింది.



పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంపిటీషన్ బాక్స్‌లో ఐడియా చిట్టీలు వేస్తున్న విద్యార్థులు

జిల్లా వివరాలు	
విద్యాసంవత్సరం	వచ్చిన ప్రాజెక్ట్‌లు
2022-23	54
2023-24	38
2024-25	54

విద్యార్థులను ప్రోత్సహించాలి



ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందిస్తే విద్యార్థులు అద్భుతాలు సృష్టించగలరు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకత టీచర్లకే తెలుస్తుంది. వారు నూతన ఆవిష్కరణలు తయారు చేసేందుకు చక్కని వేదిక ఇన్‌స్పైర్ మనక్. దీని ద్వారా దేశానికి శాస్త్రవేత్తలను అందించేందుకు కృషి చేయాలి.

- చిలుముల రాజిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

క్లుప్తంగా

వీరభద్రుడి సన్నిధిలో రుద్రహోమం



పూజలు నిర్వహిస్తున్న ప్రతాప్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డితో అర్చకులు శాస్త్రోక్తంగా రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదమంత్రాల మధ్య నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా జరిగిన పూజల్లో విశేష సంఖ్యలో భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, పర్యవేక్షకులు సోమయ్య, అర్చకులు శ్రవణ్ కుమార్, సంతోష్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

క్విజ్‌లో మెరిసిన విద్యార్థినులు

దుబ్బాకటౌన్: సైన్స్‌కు చెందిన క్విజ్ పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సైన్స్ అండ్ స్టాండర్డ్ స్టేట్ లెవెల్ ఆన్‌లైన్ క్విజ్ కార్యక్రమంలో దుబ్బాక పీఎంశ్రీ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థినులు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వప్న శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో 27 మంది విద్యార్థులు విజేతలవగా, వారిలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రజ్ఞ, భావన, శ్రీ కీర్తి, వైష్ణవి, రేణుశ్రీ, అనూష, విజయశ్రీ, లక్షిత ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ మెంటర్ రజిత, విద్యార్థినులను అభినందించారు.

మహిళ అదృశ్యం



నాగమణి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహిళ అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింహులు వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన చిట్కుల్ నాగమణి కూతురు శ్వేతను, గ్రామానికి చెందిన జూల విష్ణుతో 8 ఏళ్ల క్రితం వివాహం జరిపించింది. భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో శ్వేత నెల రోజులుగా అమ్మగారి ఇంటి వద్దే ఉంటుంది. ఈ నెల 6న విష్ణు వచ్చి తల్లికూతుళ్లతో గొడవపడి, భార్యను ఇంటికి తీసుకెళ్లాడు. మర్నాడు శ్వేత అమ్మగారి ఇంటి వద్దకు వెళ్లగా నాగమణి(50) కనిపించలేదు. గ్రామంలో, బంధువుల వద్ద ఆరా తీసినా ఆమె ఆచూకీ అభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అనుమానాస్పదంగా వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చిట్కుల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నర్సింహులు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బోయిని కిష్టయ్య (65) శుక్రవారం ఉదయం పత్తిచేనుకు మందు పిచికారీ చేశాడు. అనంతరం గ్రామానికి చెందిన బీర్ల కిష్టయ్యతో కలిసి మద్యం తాగాడు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బోయిని కిష్టయ్యను గ్రామంలోని పాఠశాల వద్ద ఉన్న కల్వర్టు దగ్గర బీర్ల కిష్టయ్య వదిలి వెళ్లాడు. కాసేపటికి గ్రామానికి చెందిన నాగరాజు వెళ్లి చూడగా కల్వర్టుపై గాఢనిద్రలో ఉన్నాడు. సాయంత్రం నాలుగైనా ఇంటికి రాకపోవడంతో అతని కుమారుడు మల్లేశం వెళ్లి కిష్టయ్యను లేపడానికి ప్రయత్నించగా మృతి చెంది ఉన్నాడు.

బాక్స్ క్రికెట్.. భలే క్రేజ్

ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు తీరిక సమయంలో రాత్రి వేళల్లో ఫ్లడ్ లైట్ల వెలుతురులో సరదాగా బాక్స్ క్రికెట్ ఆడుతున్నారు. జిల్లాల్లో ఆటస్థలాలు లేకపోవడంతో చాలామంది ఇటువైపు ఆకర్షితులవుతున్నారు. ఉద్యోగులు వారాంతపు సెలవుల్లో తమ కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడపటానికి, ఆటలు ఆడటానికి వస్తున్నారు. ఈ ప్రాంగణంలో క్రికెట్ కాకుండా ఇతరత్రా గేమ్స్, వినోదం, సినిమాలు చూడటానికి వీలుగా ప్రొజెక్టర్ సదుపాయం ఏర్పాటు చేశారు.

– రామాయంపేట(మెదక్)

నగరాల నుంచి గ్రామాలకు విస్తరిస్తున్న ట్రెండీ గేమ్

- స్థలాలు లేకపోవడంతో యువత మొగ్గు
- రాత్రి కూడా ఆడుకునే అవకాశం
- గంటకు రూ.400 నుంచి 600 వరకు వసూలు
- జిల్లాలో వెలుస్తున్న మినీ ప్రాంగణాలు



జిల్లాలో మొత్తం ఆరు బాక్స్ క్రికెట్ ప్రాంగణాలు ఉన్నాయి. మెదక్‌లో రెండు, నర్సాపూర్, తునికి, తూప్రాన్ పోతరాజుపల్లిలో ఒకటి చొప్పున ఉన్నాయి. వీటిని ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం రూ.25 నుంచి 30 లక్షలు ఖర్చవుతాయి. మెదక్‌లో ఇటీవల నెలకొల్పిన బాక్స్ క్రికెట్ ప్రాంగణంతోపాటు వాలీబాల్, ప్రాక్టీస్ నెట్, క్యారం, స్నూకర్, క్యాంటీన్, పెద్ద స్థాయిలో ప్రొజెక్టర్, ఇతర సదుపాయాలు సైతం నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వారాంతం, సెలవు దినాల్లో ఎక్కువ రద్దీ ఉంటుంది. వర్షాలు కురిసినా, ఎండలో సైతం ఆట ఆడడానికి వీలుగా వీటిని నిర్మించారు. ఒకరిద్దరు క్రికెట్ ఆడటానికి వస్తే బౌలింగ్ చేయడానికి వీలుగా ప్రత్యేకంగా మిషన్ సదుపాయం ఉంటుంది. ఆటస్థలాలు కరువైన నేపథ్యంలో బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతుంది.

పేరుకు తగ్గట్టుగానే

బాక్స్ క్రికెట్ అంటే సాధారణ క్రికెట్‌కు మరో రూపం. పేరుకు తగ్గట్టుగానే ఇది ఒక బాక్స్‌లో పరిమిత స్థలంలో నెలకొల్పుతారు. సాధారణంగా 30 నుంచి 40 మీటర్ల పొడవు, పది నుంచి 20 మీటర్ల వెడల్పుతో ప్రాంగణంలో ఏర్పాటు చేస్తారు. లోపల పిచ్ ప్లాస్టిక్ లేదా సింథటిక్‌తో తయారు చేసిన కార్పెట్‌ను ఉపయోగిస్తారు. ఆట స్థలం చుట్టూ బంతి బయటకు వెళ్లకుండా నెట్స్ లేదా గోడలు నిర్మిస్తారు. క్రికెట్ కోసం వినియోగించే బంతికి బదులుగా టెన్నిస్ బాల్ ఉపయోగిస్తారు. క్రికెట్ బంతితోపాటు స్టంప్స్, హెల్మెట్, గ్లౌసులు, ప్యాడ్‌లు నిర్వాహకులు సమకూరుస్తారు. పెద్ద మైదానంలో ఆడే క్రికెట్ ఆటకు భిన్నంగా బాక్స్ క్రికెట్‌లో కేవలం ఆరు నుంచి 10 ఓవర్లలోపే ఆడతారు. నిర్ణీత స్థలంలో ఆడటానికి క్రేజ్ పెరుగుతోంది.

చార్జీలు ఇలా.. వసతులు భళా

బాక్స్ క్రికెట్ ఆడేందుకు రద్దీ వేళల్లో ఒక ధర, సాధారణ రోజుల్లో మరో ధర ఉంటుంది. రాత్రివేళలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో క్రికెట్ ఆడటానికి గంటకు రూ. 4వందల నుంచి 6వందలు, వాలీబాల్‌కు రూ. 300 నుంచి 400 , స్నూకర్స్‌కు రూ. 200 వందల చొప్పున వసూలు చేస్తారు. క్రికెట్ చూడటానికి వచ్చే ప్రేక్షకుల కోసం సిట్టింగ్, వాష్‌రూం, క్యాంటీన్, తాగునీటి సదుపాయం ఉంటుంది. ఆటలు ఆడుతున్న క్రమంలో ఎవరికైనా దెబ్బలు తాకితే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా సిద్ధంగా ఉంటాయి. క్రీడాకారులను ఉత్తేజ పర్చడానికి మ్యూజిక్ సిస్టం ఏర్పాటు చేశారు. ఎవరైనా నేరుగా వచ్చి బుక్ చేసుకోవచ్చు. లేకపోతే ఆన్‌లైన్‌లో కూడా బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నారు.



సీసీ కెమెరాల పర్యవేక్షణలో

బాక్స్ క్రికెట్ నిర్వహణ సీసీ కెమెరాల పర్యవేక్షణలో కొనసాగుతుంది. క్రీడాకారులు ఎంతసేపు ఆడారు? ఏమైనా గొడవలు జరుగుతున్నాయా? అని ఆన్‌లైన్‌లో పర్యవేక్షించుకునే అవకాశం ఉంటుంది. దీంతోపాటు క్రీడాకారులు తమ ఆట తీరును విశ్లేషించుకోవడానికి సీసీ ఫుటేజీ ఎంతగానో ఉపయోగపడుతుంది.

గ్రామాల్లోనూ ఆదరణ



“క్రీడా మైదానాలు లేకపోవడం, స్థల సమస్యతో చాలా మంది బాక్స్ క్రికెట్ వైపు మొగ్గుతున్నారు. గ్రామాల్లో సైతం ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. దీంతో క్రీడాకారులు తమకు సమయం దొరికినప్పుడు ఆడుతున్నారు.

– పూసల మణి, క్రికెట్ క్రీడాకారుడు, రామాయంపేట

క్రికెట్‌కు కొత్త రూపు



బాక్స్ క్రికెట్ అనేది సంప్రదాయ క్రికెట్‌కు కొత్త రూపం. నగరాల్లో స్థలం లేని పక్షంలో ఖాళీగా ఉన్న చిన్న ప్రదేశాల్లో సైతం దీనిని ఏర్పాటు చేసుకోవచ్చు. కుటుంబ సభ్యులు, స్నేహితులు తమ కుటుంబాలతో సరదాగా ఆడుకోవడానికి ఇది మంచి మార్గం.

– సాయికృష్ణ, క్రీడాకారుడు, మెదక్

ఆస్వాదిస్తున్నారు



బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతుంది. వారాంతం, సెలవు రోజుల్లో విపరీతమైన రద్దీ ఉంది. క్రీడాకారులతోపాటు వచ్చే వారికి అన్ని రకాల సదుపాయాలు ఒకే చోట కల్పించాం. విరివిగా టోర్నమెంట్లు సైతం నిర్వహిస్తున్నాం.

– ధనుష్, బాక్స్ క్రికెట్ నిర్వాహకులు, మెదక్”

పరిశ్రమ గోడ కూలి ఒకరు మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- కాళ్లకల్ స్పిన్నింగ్ పరిశ్రమ వద్ద బాధిత కుటుంబాల ఆందోళన



కూలిన పరిశ్రమ గోడ



బాల్‌రెడ్డి



కాలువిరిగి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న రవి

మనోహరాబాద్(తూప్రాన్): పరిశ్రమలో గోడ కూలి ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మండలంలోని రామా స్పిన్నర్ పరిశ్రమలో మండలానికి చెందిన తమ్మారెడ్డి బాల్‌రెడ్డి (54) ఎలక్ట్రిషియన్‌గా, కాళ్లకల్ గ్రామానికి చెందిన గానుగు రవి కూలీగా పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం పరిశ్రమలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా పనులు చేస్తున్నారు. అదే సమయంలో పరిశ్రమ గోడ కూలడంతో శిథిలాల కింద బాల్‌రెడ్డి నలిగి అక్కడిక్కడే చనిపోయాడు. రవి ఎడమ కాలుపై గోడ పడటంతో కాలు నుజ్జునుజ్జయి తెగిపోయింది. దీంతో అతడ్ని హుటాహుటిన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకుని న్యాయం చేయాలని ఆందోళన చేశారు. మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, తూప్రాన్ ఎస్‌ఐ శివానందం అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడిన మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తున్కిబొల్లారంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బక్కస్వామి భారతి(40) కొంత కాలంగా లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రిలో హౌస్‌కీపర్‌గా పనిచేస్తుంది. శుక్రవారం రాత్రి డ్యూటీ ముగిసిన తరువాత భారతి తన కుమారుడితో కలిసి బైక్‌పై గ్రామానికి వస్తోంది. ఈ క్రమంలో మార్గమధ్యలో ఎల్లమ్మ గుడి వద్దకు చేరుకోగానే భారతికి ఆకస్మికంగా తల తిరగడంతో బైక్‌పై నుంచి కిందపడింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని కుమారుడు రవితేజ తండ్రి శంకర్‌కు తెలుపడంతో వెంటనే ఆమెను ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ భారతి శనివారం మధ్యాహ్నం మృతి చెందింది.

కంపు కొడుతున్న కోమటికుంట





నర్సాపూర్ కోమటి కుంటలో దర్శనమిస్తున్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, వ్యర్థాలు

- చెత్త, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిన వైనం
- పట్టించుకోని అధికారులు

నర్సాపూర్: పట్టణంలోని పలువురు వ్యాపారులు, ప్రజలు రాత్రి పూట దొంగచాటుగా ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు కుంటలో పారవేయడంతో కలుషితమవుతోంది. స్థానిక చౌరస్తా సమీపంలో తూప్రాన్ రహదారిని ఆనుకుని ఉన్న కోమటి కుంటలో కుప్పలు కుప్పలుగా థర్మకోల్, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు, కవర్లు, ఇతరత్రా వ్యర్థాలను రాత్రి కుంటలో పారవేస్తున్నారు. ఇష్టానుసారంగా పారవేయడంతో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. కుంటలో వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీరాం చరణ్ రెడ్డిని వివరణ కోరగా... ప్లాస్టిక్ వాడొద్దని వ్యాపారులకు చెప్పినా వినడం లేదని విచారం వ్యక్తం చేశారు. కుంట సమీపంలో త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెడతామని, వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానా విధించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డుపై దిగబడిన ఇసుక లారీ



రోడ్డుపై దిగబడిన లారీని జేసీబీల సహాయంతో బయటకు తీస్తున్న నిర్వాహకులు

తొగుట(దుబ్బాక): మట్టిరోడ్డుపై వెళ్లే వాహనాలు దిగబడటం సహజం.. కానీ ఇక్కడ బీటీ రోడ్డుపై వెళ్తున్న ఇసుక లారీ దిగబడింది. ఈ ఘటన మండలంలోని మెట్టు వద్ద శనివారం చోటు చేసుకుంది. తొగుట-సిద్దిపేట రహదారిపై మెట్టు వద్ద రోడ్డు పాడై గుంతలమయంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కాగా సిరిసిల్ల నుంచి ఇసుక లారీ హైదరాబాద్‌కు వెళ్తుండగా గుంతలో దిగబడిపోయింది. దీంతో లారీని జేసీబీ, ట్రాక్టర్‌ల సహాయంతో బయటకు తీసేందుకు నానాతిప్పలు పడ్డారు. ఎంతకూ లారీ బయటకు రాకపోవడంతో మరో జేసీబీని తీసుకువచ్చారు. ఎట్టకేలకు రెండు జేసీబీల సహాయంతో లారీని బయటకు తీశారు.

ఆదివాసీల సంక్షేమానికి కృషి: డీటీడీఓ రామేశ్వరి దేవి

కడ్తాల్: ఆదివాసీ గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి (డీటీడీఓ) రామేశ్వరి దేవి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని మైసిగండి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో పోరాట యోధుడు కొమురంభీం చిత్రపటానికి అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజనుల జీవన విధానం ప్రత్యేకమైనదని, అడవి తల్లిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. అడవిబిడ్డల హక్కుల కోసం కొమురం భీం అహర్నిశలు పాటుపడ్డారని, వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడని కొనియాడారు. గిరిజనులకే కాదు.. అన్ని జాతులకు ఆయన పోరాటం స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాపయ్య, హెచ్‌డబ్ల్యూఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కుల్కచర్ల: పొలం వద్ద విద్యుత్ పనులు పరిశీలిస్తున్న యువరైతు కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన శనివారం కుల్కచర్ల మండలంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బిందెంగడ్డ గ్రామ పంచాయతీ చింతల్‌కుంట తండాకు చెందిన నేనావత్ భాస్యనాయక్ మధ్యాహ్నం పొలం వద్ద బోరు మోటారు సమస్య తలెత్తింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ పనులను పరిశీలిస్తున్న క్రమంలో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన కుటుంబీకులు అతన్ని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లుగా గ్రామస్తులు తెలిపారు.

అంబులెన్స్‌కు దారేది?

సంగారెడ్డి పాత బస్టాండ్ దిడ్డిగౌని దగ్గర వాహనాలు ఇష్టమొచ్చినట్టు పార్క్ చేస్తున్నారు. దీంతో ఒక వాహనం మాత్రమే వెళ్తుంది. రెండో వాహనం వచ్చినప్పుడు ఎవరో ఒకరు వెనక్కి వెళ్లాల్సి వస్తుంది. వాహనాలు వెనకకు తీసే క్రమంలో వాహనదారులు పోట్లాడుకుంటున్నారు. అంబులెన్సు వచ్చినా దారివ్వలేకపోతున్నారు. స్పీడ్‌గా వెళ్లటం కష్టం అవుతుంది. ఎవరో ఒకరు వచ్చి వాహనాలు పక్కకు తీశాక వెళ్లాల్సి వస్తుంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



దిడ్డిగౌని దగ్గర రోడ్డుపై కారు రావడంతో ముందుకు వెళ్లలేక ఆగిన అంబులెన్సు

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

- ఈనెల 13వరకు గడువు
- రైతు వేదికల్లో దరఖాస్తుల స్వీకరణ
- వెల్లడించిన వ్యవసాయ అధికారులు



జహీరాబాద్ : రైతు వేదిక

జహీరాబాద్ / నారాయణఖేడ్ /వట్‌పల్లి(అందోల్)జిన్నారం (పటాన్‌చెరు): రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 13వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని ఖేడ్ ఏడీఏ నూతనకుమార్, ఏఓ ప్రవీణ్ చారి, జహీరాబాద్, గుమ్మడిదల అధికారులు, వట్‌పల్లి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించి రైతులు తమ పరిధిలోని రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు 2025 జూన్ 5వ తేదీ నాటికి భూభారతి పోర్టల్‌లో డిజిటల్ సైన్ చేసిన పట్టాదారు పాస్ బుక్ కలిగి ఉన్న రైతులు మాత్రమే అర్హులని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయసు అనగా 14 ఆగస్టు 1966 నుంచి 14 ఆగస్టు 2007 మధ్య పుట్టిన వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. సంబంధిత రైతే స్వయంగా వచ్చి రైతు వేదికలో దరఖాస్తు అందజేయాలని, కుటుంబ సభ్యులు వచ్చినా ఎటువంటి దరఖాస్తులు స్వీకరించమని తెలిపారు.

దరఖాస్తు ఇలా..

దరఖాస్తు ఫారానికి రైతు ఆధార్ కార్డు జిరాక్స్, రైతు పేరుపై ఉన్న భూమి పట్టాపాసు పుస్తకం జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను జత చేయాలి. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని రైతు వేదికలో కలిసి దరఖాస్తు చేసుకోవాలి. భూమి కలిగి ఉండి రైతు బీమా నమోదు చేయించుకోని రైతుల వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారులు వద్ద ఉన్నాయని సందర్శించి తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఏమైనా తప్పులు ఉన్నట్లయితే సరిచేసుకునే అవకాశం ఉందన్నారు.

యువకుడికి గాయాలు

నారాయణఖేడ్: పట్టణంలో గుంతల రోడ్ల వల్ల ఓ యువకుడు బైక్ పైనుంచి పడి గాయపడ్డాడు. మండలంలోని పిప్రికి చెందిన కాశీనాథ్ (35) బైక్‌పై ఖేడ్ నుంచి తన గ్రామానికి శనివారం బయలుదేరారు. పట్టణ శివారులో రోడ్డుపై ఏర్పడ్డ గోతుల వల్ల బైక్ స్కిడ్ అయి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు అతడ్ని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తల, ముఖానికి గాయాలయ్యాయి.

కొనలేం.. తినలేం..

- కూరగాయల ధరలు పైపైకి
- వర్షాకాలంలోను తగ్గని రేట్లు
- ఆందోళన చెందుతున్న ప్రజలు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సదాశివపేట(సంగారెడ్డి): కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ప్రస్తుతం శ్రావణ మాసంలో వీటి ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సాగు విస్తీర్ణం తగ్గిన కారణంగానే ఈ దుస్థితి నెలకొందని తెలుస్తుంది. ధరలు సామాన్యులను వణికిస్తున్నాయి. మొన్నటి వరకు 30 పలికిన టమాట ధర ఇప్పుడు 60కి చేరింది. చవకగా దొరికే దొండకాయ 60, ఆలుగడ్డ 40 పలుకుతుంది. ఏ కూరగాయను కొనేటట్టు లేదు. దీంతో వినియోగదారులు కొనుగోలు చేయలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. నెల రోజుల నుంచి పెరుగుతున్న కూరగాయల ధరలు చూసి సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళితే బుట్టనిండటం లేదు. మాంసాహార ప్రియులు ప్రస్తుతం కోడిగుడ్లు, చికెన్ కొనుగోలు చేస్తున్నారు. శాఖాహార ప్రియులపై పెరిగిన ధరలు అధికంగా ప్రభావం చూపుతున్నాయి. దీంతో కూరగాయల కంటే పప్పుదినుసులే నయమని భావిస్తున్నారు.

ధరలు పెరిగి.. ఉత్పత్తి తగ్గి

శ్రావణం హిందువులకు పవిత్ర మాసం కావడంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి ఒక్కరూ కూరగాయలే వండుతుంటారు. దీంతో కూరగాయల వినియోగం పెరగడంతో డిమాండ్ కూడా అదే మాదిరిగా ఉంది. వారం పదిరోజుల క్రితం వరకు అందుబాటులో ఉన్న ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. ధరలు పెరగడంతో ఓ కుటుంబం గతంలో కిలో కొనుగోలు చేసేవారు ఇప్పుడు పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. పచ్చిమిర్చి కేజీ రూ.100కు చేరడంతో వాటిని ముట్టుకోవడానికే సాహసించడం లేదు. బీన్నీస్ కేజీ రూ.100, గోరు చిక్కుడు కాయ కేజీ రూ.80, చిక్కుడు పెద్దది రూ.100, బీరకాయ కిలో రూ.80, క్యాబేజీ పువ్వు ఒకటి రూ.50, క్యాప్సికమ్ రూ.80, క్యారెట్ రూ.60, టమాట రూ.60, మునగకాయలు కిలో రూ.120, ఇలా ఏ కూరగాయ చూసినా కొనలేని విధంగా ఉన్నాయి. ఆకుకూరలను రూ.5కు ఒక కట్ట అమ్ముతున్నారు. రైతులు సాగు విస్తీర్ణం తగ్గించడం వల్ల కూరగాయల దిగుబడి తగ్గిపోయింది.

అధికారుల సూచనలు కరువు

రైతులకు రాయితీపై విత్తనాలు అందజేయడం , సాగులో సూచనలివ్వడం, మార్కెట్ సదుపాయం కల్పించడం, స్టోరేజీ సౌకర్యాలు ఏర్పాటు చేయడం వంటి వాటిపై అధికారులు శ్రద్ధ కనపర్చడం లేదు. దీంతో రైతులు కూడా కూరగాయల సాగుపై అంతగా ఆసక్తి చూపడం లేదు. నూతన యాంత్రీకరణ పద్ధతులు కొత్త వంగడాలపై కూడా అవగాహన కరువవుతోంది. ఈ విషయంలో వ్యవసాయ అధికారులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.